క్లుప్తంగా

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా సైదులు బాధ్యతల స్వీకరణ



నల్లగొండ క్రైం: పట్టణంలోని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన కరుణాకర్ మిర్యాలగూడ వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. 2007బ్యాచ్‌కు చెందిన సైదులు హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నల్లగొండ టౌన్: తెలంగాణ రాష్ట్రంలో వీఓఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏపీడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏపీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిలుముల దుర్గయ్య, సులోచన, మంగమ్మ, రేణుక, పద్మ, నాగమణి, బద్రి, సైదులు, వెంకన్న, లలిత, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



ధర్నా చేస్తున్న ముత్యాలమ్మ కాలనీవాసులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇళ్లకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. అన్నేశ్వరమ్మ గుట్ట వద్ద ఉన్న భూమి పేదల ఇళ్ల స్థలాలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మదార్, యూసుఫ్, లెనిన్, వీరయ్య, కోటేష్, సుజాత, కౌసల్య, సైదమ్మ, రజిత, మాదవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



పూజలు చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

మునుగోడు: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ అన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నర్సింహగౌడ్ సొంత డబ్బులు రూ.7లక్షలు ఖర్చుచేసి పునర్నిర్మించిన మండల కేంద్రంలోని ఈదమ్మ దేవాలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, పాల్వాయి యాదగిరిరెడ్డి, బండా పురుషోత్తంరెడ్డి, బొడ్డు పెద్ద చంద్రమౌళిన, పాల్వాయి చెన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, బండారి పాండరి, ఎండీ.అన్వర్, లక్ష్మయ్య, పరమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మడివాల మాచిదేవుడి కల్యాణం

మర్రిగూడ: మండల కేంద్రంలోని గ్రామ భారతి ఎదురుగా ఉన్న మడివాల మాచిదేవుడు సీతాలమ్మ ఈదమ్మల కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.. స్వామి వారి కల్యాణం సందర్భంగా బుధవారం గణతి పూజ, అఖండ దీపారాధాన, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి లోక వెంకటశర్మ తెలిపారు.

గురుకుల పాఠశాలకు మోటారు అందజేత



మోటారు బిగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మునుగోడు: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలకు బుధవారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నీటి మోటారును అందజేశారు. మోటారు నుంచి పాఠశాలలోకి నీరు సరఫరా చేసేందుకు అవసరమైన పైపులైను త్వరలో ఏర్పాటుచేస్తామని ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కంకణాల సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

తిప్పర్తి: మండలంలోని సిలార్మియగూడెంలో శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో జూన్ 2న ఆలయ హుండీ చోరీకి గురై రూ.10వేల నగదు పోయిందని చైర్మన్ ఎర్ర మాద నరేందర్ రెడ్డి బుధవారం తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొక్కలు తెచ్చారు.. నాటడం మరిచారు

- వారం కావొస్తున్నా నర్సరీల్లోనే..
- 'వనమహోత్సవం'పై అధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ



మర్రిగూడ : నాటకుండా నర్సరీల్లోనే ఉన్న మొక్కలు

మర్రిగూడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు మర్రిగూడ మండలానికి వారం రోజుల క్రితం తీసుకువచ్చిన మొక్కలు నేటికీ నాటకపోవడమే నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరగడకపోవడంతో మండలంలోని ఆయా గ్రామాల రహదారుల వెంట పెద్ద మొక్కలను నాటాలని అధికారులు నిర్ణయించారు. కలెక్టర్ ఆదేశానుసారం హైదరాబాద్ నుంచి ఏపుగా పెరిగిన మొక్కలను తీసుకువచ్చారు. వారం రోజులు గడిచినా ఆ మొక్కలను నాటకపోవడంతో నర్సరీల్లోనే దర్శనమిస్తున్నాయి.

ఒక్కో మొక్కకు రూ.20చొప్పున..

మర్రిగూడ మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ నుంచి మొక్కలను పంపిణీ చేశారు. వీటి రవాణా ఖర్చు ఒక్కో మొక్కకు రూ.20చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గ్రామాల వారీగా నామాపురం -400 మొక్కలు, వట్టిపల్లి-250, రాజాపేటతండా-200, సరంపేట -200, మేటిచందాపురం -200, మర్రిగూడ-200, అజ్జిలాపురం -150, దామెర భీమనపల్లి- 150 చొప్పున ఇలా మొత్తం మండల వ్యాప్తంగా 1750 మొక్కలు పంపిణీ చేశారు.

సంరక్షణ మరిచారా...

వచ్చిన మొక్కలను వెంటనే నాటాల్సి ఉంది. పలు గ్రామాల్లో మొక్కలను నాటకపోవడం, మరికొన్ని గ్రామాల్లో 40, 50శాతం నాటి అధికారులు వదిలేసినట్లు తెలుస్తుంది. మొక్కలను నాటిన వెంటనే దానికి సపోర్ట్‌గా కర్రను నాటి బయోఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సి ఉంది. సంబంధిత మొక్కలకు నీరు పెట్టి సంరక్షించేందుకు వాచర్‌ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సిబ్బంది మొక్కలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నర్సరీల్లో ఉన్న మొక్కలను సంరక్షించడంతోపాటు వాటిని సకాలంలో రోడ్డుకు ఇరువైపులా నాటాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కూలీల కొరతతో ఆలస్యం

కూలీల కొరత కారణంగానే మొక్కలు నాటించలేదు. రెండు రోజుల్లో మొక్కలను నాటే కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం. పలు గ్రామాల్లో ఇప్పటికే 50శాతం వరకు మొక్కలు నాటించాం.

– వివేక్, ఇన్‌చార్జి ఎపీఓ

సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్: పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోయినప్పటికీ గత విధానాలనే అవలంబిస్తుందని ఆరోపించారు. కేవలం సంపన్న వర్గాలకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తూ పేదలపై ధరల భారాన్ని మోపుతుందన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ధరల కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్,పబ్బు వీరస్వామి, బొడ్డుపల్లి వెంకటరమణ, బొల్గురి నరసింహ, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం ,ఆర్.అంజయ్య, టి. వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు పాటుపడాలి

నల్లగొండ టూటౌన్: ఆర్ఎస్ఎస్ కరసేవకులు దేశ సమైక్యతకు పాటు పడాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ రాజగోపాల్ అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక కరసేవకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశభక్తిని పెంచుకుని ఆర్ఎస్ఎస్ పని చేస్తుందన్నారు. ప్రజలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేయడమే ఆర్ఎస్ఎస్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్ఎస్ఎస్ కరసేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పరడలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు

కట్టంగూర్ : మండలంలోని పరడ గ్రామంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించనున్న కంఠమహేశ్వరస్వామి, రేణుకాఎల్లమ్మ, వనం మైసమ్మ దేవాలయాలకు బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భూమిపూజ చేసి మాట్లాడారు. దైవ భక్తితోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్యగౌడ్, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామిగౌడ్, రెడ్డిపల్లి సాగర్, పెద్ది యాదగిరి, పుట్ట నర్సింహ్మారెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, గుండాల మల్లేష్, బద్దం రాములు, బద్దం శ్రీనివాస్, కొండ యాదయ్య, సత్తయ్యగౌడ్, కారింగుల శంకర్, ఐతగోని జనార్దన్, పుల్లెంల అచ్చాలు, పుల్లెంల యాదగిరి, బద్దం నర్సింహ, కొండ నర్సింహ తదితరులున్నారు.

నిత్య అన్నదానం పుణ్య కార్యం

నార్కట్‌పల్లి : నిత్య అన్నదానం పుణ్య కార్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంస్థ వ్యవస్థాపకుడు దైద నాగరాజు 9మంది దాతల సహాయంతో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జేరిపోతుల భరత్, మట్టిపల్లి శ్రీను, దొండ రమేష్‌సత్తి, సమాద్ ఉన్నారు.

తప్పుడు పత్రాలతో ఉద్యోగం చేస్తున్న మహిళపై చర్య తీసుకోవాలి

నల్లగొండ టౌన్: తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం చేస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన మైనం దేవేందర్ జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి మైనం సహదేవులు 1974 నుంచి 1976 వరకు కట్టంగూర్ పాఠశాలలో 5వ తరగతి చదివారని పేర్కొన్నారు. 1986లో ఆ సర్టిఫికెట్లను తన తండ్రి సోదరి అక్కమ్మ తీసుకుని మైనం సహదేవులమ్మగా మార్చుకుందని ఆరోపించారు. ఆమె మొదట నల్లగొండ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉద్యోగం పొంది ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం పీహెచ్‌సీలో పని చేస్తుందని తెలిపారు. దీనిపై రెండు జిల్లాల కలెక్టర్లకు, డీఎంహెచ్ఓలకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సాహిత్య పుస్తకాలు బహూకరణ



పుస్తకాలు అందజేస్తున్న బుచ్చిరెడ్డి

కనగల్: మండలంలోని చినమాదారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి బుధవారం బాలసాహిత్య పుస్తకాలు అందజేశారు. హెచ్ఎం పద్మ మాట్లాడుతూ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన బహుమతి, బంతిపూలు వంటి పుస్తకాలతో పాటు తాను సేకరించిన పుస్తకాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ దేప నరేందర్‌రెడ్డి, మహ్మద్ ఎజాజ్, హిందురాణి,స్వర్ణలత మధు, సరిత, విజయశ్రీ, వాసు, ఉమ పాల్గొన్నారు.

పలివెల మీదుగా వెళ్లే బస్సు సర్వీసు రద్దు

- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు
- తొలగించాలని కోరినా పట్టించుకోని పంచాయతీ అధికారులు
- బస్సు సర్వీసును రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన నల్లగొండ డిపో మేనేజర్
- ఇబ్బందుల్లో పలు గ్రామాల ప్రజలు



పలివెల గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

మునుగోడు: కొన్నేళ్లుగా మునుగోడు మండలం పలివెల గ్రామం మీదుగా ప్రతి రోజు హైదరబాద్‌కు వెళ్లే బస్సు సర్వీసును బుధవారం ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. నిత్యం ఉదయం 8:30 గంటలకు నల్లగొండ డిపో నుంచి బయలదేరే ఆ బస్సు మునుగోడు మీదుగా కచలాపురం, పలివెల, కోతులారం, యాదాద్రి భువనగిరి జిల్లా మల్లారెడ్డిగూడెం, సర్వేల్ నుంచి హైదరబాద్‌కు వెళ్లేది. తిరిగి మధ్యాహ్న సమయంలో అదే గ్రామాల మీదుగా నల్లగొండకు, సాయంత్రం సమయంలో పలివెల మీదుగా చౌటుప్పల్‌కు వెళ్లి తిరిగి రాత్రి నల్లగొండకు చేరుకునేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు నిత్యం ఆ బస్సులో ప్రయాణిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు.

పగులుతున్న బస్సు అద్దాలు

బస్సు సర్వీసు నడిచే రోడ్డు పలివెల గ్రామ శివారు నుంచి మల్లారెడ్డిగూడెం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరిగాయి. బస్సు వెళ్తున్నప్పుడు కంప మండలు బస్సు అద్దాలకు తగిలి పగిలిపోతుండడమే కాకుండా అందులోని ప్రయాణికులకు గాయాలవుతున్నాయి. ఆ చెట్లను తొలగించాలని ఆర్టీసీ అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో బస్సు సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ నలగొండ డిపో మేనేజర్ ప్రకటించారు. ఆ బస్సుపై ఆధారపడిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

చందుపట్లలో వైద్యశిబిరం



వైద పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నకిరేకల్ : నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో బ్లేసింగ్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో హ్యాండ్ ఆఫ్ హోఫ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 300 మందికి వైద పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఉచితంగా రక్త, బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ, కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. స్థానిక చర్చి పాస్టర్ బల్లేం జీవ ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమం మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్, కోజంగజయరాజ్, పాస్టర్ ఆదిమల్ల అంతయ్య, డాక్టర్లు వాసవీ, భరత్, స్వరూప్, శ్రీధర్, అజయ్, మనోజ్ఞ, సంపత్, సుమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మర్రిగూడ: విద్యార్థులు విద్యా, క్రీడారంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఐ కె.రంగారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని యరగండ్లపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో జగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ దుర్గా కల్యాణి, జ్యోస్నారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, రామచందర్, అశోక్‌రెడ్డి, హెచ్ఎం మాలతి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



డీటీ విజయకు వినతిపత్రం ఇస్తున్న ఎలక్ట్రీషియన్లు

చిట్యాల : ఎలక్ట్రీషియన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీపీఈటీఎఫ్ మండల అధ్యక్షుడు బరాల స్వామి కోరారు. తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం డీటీ విజయకు వినతిపత్రం సమర్పించారు. మండలకేంద్రంలో ఎలక్ట్రీషియన్ల సాంకేతిక శిక్షణకు వేయిగజాల స్థలం కేటాయించాలని, మెటర్నరీ, మ్యారేజ్ బెనిఫిట్స్ మొత్తం రూ.50లకు పెంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మంపాటి నర్సింహ, బెల్లి యాదయ్య, తాడూరి చంద్రం, కడారి వెంకన్న, జడల మహేష్, వైరాల రాహుల్, కొసనం శేఖర్, చింత అశోక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల : అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. చిట్యాల ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘ కాలం పనిచేసి బదిలీపై వెళ్లిన కందిమల్ల విజయలక్ష్మి ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం బుధవారం పాఠశాల ఆవరణలో జరిగింది. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగునకు విజయలక్ష్మి చేసిన కృషిని ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంబటి సత్తయ్య, బాదం భిక్షపతి, సరిత, సుధాకర్‌రెడ్డి, పుష్పలత, మాధవి, ఊర్మిల, సహిత, విద్య, శ్రీనివాస్, చంద్రకళ, వనజ పాల్గొన్నారు.

అల్లుకున్న తీగ 'బంధం'



మండలకేంద్రంలోని శాలిగౌరారం–గురుజాల రోడ్డువెంట విద్యుత్ స్తంభాన్ని తీగజాతి మొక్క అల్లుకుంది. దీంతో సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై తరచూ ఫ్యూజ్ పోతుండటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. తీగజాతి మొక్కను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

– శాలిగౌరారం

ఆలయ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

శాలిగౌరారం: మండలంలోని మాదారంకలాన్ గ్రామంలో గల శ్రీదేవిభూదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద కల్యాణ మండప నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నోముల జనార్దన్ మాట్లాడుతూ భక్తుల విరాళాలు సుమారు రూ.10 లక్షలకు పైగా వ్యయంతో నూతనంగా దేవాలయ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. మండపం లేక ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవతామూర్తుల కల్యాణ వేడుకల నిర్వాహణ సమయంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దేవాలయ అభివృద్ధికి భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పులి రామకృష్ణశర్మ, జేరిపోతుల చంద్రమౌళి, నోముల రవి, విష్ణు, శ్రీకాంత్, వాస వెంకన్న, శివ, మదనాచారి, నాగయ్య, మురళి, సైదులు, హరీష్, నర్సింహాచారి, సాగర్‌రెడ్డి, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి



మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 11వ పీఆర్‌సీ పెండింగ్ ఏరియర్స్ ఇవ్వకుండా జాప్యం చేయడం సరైంది కాదన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, చెప్పులు, సబ్బులు, నూనె, రెయిన్‌కోట్లు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండంపల్లి సత్తయ్య, యూనియన్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల సంజీవ, పాలడుగు వెంకటేశం, కృష్ణవేణి, ఎల్లమ్మ, లింగయ్య పాల్గొన్నారు.

ఇరువైపులా కంపచెట్లు.. అడుగడుగునా గుంతలు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు



గుంతలమయంగా సత్యనారాయణపురం రోడ్డు

- అధ్వానంగా సత్యనారాయణపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

కట్టంగూర్ : మండలంలోని కల్మెర గ్రామం నుంచి సత్యనారాయణపురం గ్రామానికి వెళ్లే రహదారి గుంతల మయంగా మారింది. ఈ దారిగుండా వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం కురుమర్తి ,అక్కలాయిగూడెం గ్రామాలతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు వివిధ పనులు నిమిత్తం నిత్యం ఈ దారిగుండా వెళుతుంటారు. మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ దారికి ఇరువైపులా కంపచెట్లు పెరగటంతో పాటు అడుగు అడుగనా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు రాత్రిపూట జంకుతూ ప్రయాణిస్తున్నారు. మూలమలుపుల వద్ద చెట్లు పెరగటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. కల్మెర గ్రామంలోని మురుగునీరంతా ఈ దారిగుండా ఉన్న డ్రెయినేజీ ద్వారా వెళ్తుంది. డ్రెయినేజీ పూడుకుపోవడంతో పాటు ఇరువైపులా చెట్లు పెరగటంతో నీరు వెళ్లక దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే మురుగుకాల్వను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కల్మెర గ్రామం నుంచి సత్యనారాయణపురం బాట గుంతల మయంగా మారటంతో రైతులు, గీతకార్మికులు, పశువులు, గొర్ల కాపరులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పొడవునా అడుగుఅడుగునా గుంతలు ఏర్పడటంతో ఈ దారిగుండా వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద చెటలను తొలగించి బీటీ రోడ్డు నిర్మించాలి.

– తండు సోమయ్య, కల్మెర

రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే ప్రారంభం



తాటికల్‌లో సర్వే చేస్తున్న ఏఓ జానిమియా

నకిరేకల్ : పంట రుణమాఫీ కానీ రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసేందుకు నకిరేకల్ మండలం తాటికల్, తెట్టికుంట గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి జానిమియా ఆధ్వర్యంలో ఏఈఓలు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ జానిమియా మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ఆధార్, కుటుంబ సభ్యుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. నకిరేకల్ మండలం వ్యాప్తంగా 1,450 మంది రైతు కుటుంబాలను నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. సర్వే అనంతరం రుణమాఫీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విక్రమ్, హిదాయ్‌తుల్లా ఉన్నారు.

కేతేపల్లి: మండలంలోని కొర్లపాడు, కొండకిందిగూడెం గ్రామాల్లో బుధవారం పంట రుణామాఫీ కాని రైతుల నిర్ధారణకు వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించారు. మండలం వ్యాప్తంగా 308 మంది రైతులను నిర్ధారణ చేయాల్సి ఉందని ఏఓ పురుషోత్తం తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

శాలిగౌరారం: రుణమాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని భైరవునిబండ, వద్దిపాముల, జాలోనిగూడెం గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ సౌమ్యశృతి మాట్లాడుతూ భైరవునిబండ, వద్దిపాముల, జాలోనిగూడెం గ్రామాలలో 63 దరఖాస్తులు ఉండగా 42 దరఖాస్తులు పరిశీలించినట్లు తెలిపారు.

మునుగోడు: రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించేందుకు బుధవారం వ్యవసాయ అధికారులు మండలంలోని చొల్లేడు గ్రామంలో సర్వే చేపట్టారు. ఇంటిటికీ తిరిగి అధికారులు సర్వేచేయగా రుణమాఫీ కానీ 17మంది రైతులు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిని తీసుకున్న సిబ్బంది వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేశారు. ఈ సర్వేలో మండల వ్యవసాయ అధికారి పద్మజ ఏఈఓ దుర్గభవాని, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.